# కాంప్లికేటెడ్ కేస్

భాగవతుల సుబ్రహ్మణ్యం



డాక్టర్ కరుణాకరం ఐ స్పెషలిస్ట్. ఆయన యీ మధ్యనే నగరంలోని ప్రధాన సెంటర్లలో కెల్లా అతి ప్రధాన మైన చిక్కడపల్లి సెంటర్లో డిస్పెన్సరీ తెరిచాడు.

అదీ మెయిన్ రోడ్ లో మేడమీద....

అంచేత మెయిన్‌రోడ్‌మీద డిస్పెన్సరీలకు వచ్చే పేషంట్లుకూడా ఎక్కువగా ఉంటారనడంలో అతిశయోక్తి లేదు.

కాని....

ఆయన దగ్గరకు వచ్చే పేషంట్లు మాత్రం తక్కువే!

ఆయన జ్వరాలకీ, జలుబులకీ, దగ్గులకీ మందివ్వడు కనుక.... కంటి డాక్టరుగా స్థిరపడ్డాడు కనుక.... కేవలం కంటికి సంబంధించిన రోగులు మాత్రమే వస్తారు కనుక....

ఆయన ఉస్మానియా ఎం.బి.పూర్తి చేసిన తర్వాత శాన్‌ఫ్రాన్సిస్కో యూనివర్సిటీలోకూడా ఐ స్పెషలైజేషన్ చేద్దామని చాలా వుత్సాహ పడ్డాడు కాని, అందుకు తగిన ఆర్థికావకాశమే కలగలేదు.

ఫారిన్ ఛాన్స్ రాగానే పిల్లనిచ్చిన మామగారు ఎగిరి గంతేసి, లక్షో -అర లక్షో ఇచ్చి పంపించక పోతా...అని హాసపర్జప చేస్తూండగానే కలలు కన్నాడు.

అది పూర్తి కాగానే ఫారిన్ ఛాన్స్ రానే వచ్చింది.

కాని....లక్షలు పట్టుకొని పిల్లనిస్తామంటూ మావగారెవరూ రాలేదు.

అందుక్కారణం లేక పోలేదు.

కరుణాకరానికి స్వయానా మేనమావ కూతురైన సీతాలక్ష్మి అడ్డంగా వుండటమే!

ఆమె అడ్డేమిటిమధ్యలో....?

అంటే....

టూకీగా చెప్పాలంటే....

కరుణాకరం తల్లీ, సీతాలక్ష్మితండ్రీ వీళ్ళ చిన్నప్పుడే ఇద్దరికీ పెళ్ళి చేసెయ్యాలని గాఢంగానిర్ణయించుకున్నారు.


అన్నయ్య కొడుక్కి.... అందులోనూ డాక్టరీ చదివిన మేనల్లుడికి సీతాలక్ష్మిని కట్టబెట్టడానికి ఆమె ఆశపడడంలో తప్పులేదు కదా!

అయితే పరిస్థితులు మారి కరుణాకరానికి కట్నం రూపేణా లక్షలు పలుకుతూంటే, అతని తండ్రి చెల్లెలకిచ్చిన మాట మర్చిపోయినట్టు నటించసాగాడు.

కాబోయే భర్త కదా అని సీతాలక్ష్మి చిన్నప్పట్నుంచీ కరుణాకరంతో చనువుగా మెలిగి, అది కాస్తా ఇటీవల జోరుగా సాగి, ఆ వుషార్లో కాలు జారింది.

అందుకు కరుణాకరం యెంతవరకు బాధ్యుడు అంటే— "పూర్తిగా" అని చెప్పాల్సిందే.

అంచేత సీతాలక్ష్మి తల్లి మేనల్లుడ్ని బ్రతిమాలి కావులించుకుని యేడ్చి "నాయనా! దాని బ్రతుకు బుగ్గిపాల్చేయకయ్యా!" అని అలా చేస్తే అదీ-నేనూ ఇంత విషం తీసుకుని ఛస్తామని కరుణాకరాన్ని కరిగించింది.




దేనికీ భయపడనివాడూ, చలించని వాడూ అయిన కరుణాకరం ఈమాటలు విని చలించిపోయేడు.

అతనికి సీతాలక్ష్మిమీద ప్రేమ లేక కాదు. అభిమానం లేకకాదు. కేవలం ఫారిన్ ఛాన్స్ కోసం డబ్బు సమకూర్చుకొనే ప్రయత్నంలో సాధించదల్చుకున్నది కోల్పోతున్నాను కదా—అనే బాధ తప్ప అతడికి మరేమీలేదు. అది అతడి బలహీనత.

అయితే....ఇలా దారుణంగా ఛస్తామని అత్తా, సీతాలక్ష్మి అనడంతో కరుణాకరంలో మానవత్వం మేల్కొంది.

వాళ్ళని అన్యాయం చెయ్యకూడదనుకున్నాడు.........

అలాగని తనకు వచ్చేపీ వదులుకోకూడ దనుకున్నాడు.

అప్పుడు వాళ్ళ దగ్గర తన మనసులో మాట బయటపెట్టాడు.

అల్లుడి కోరికవిని, ఇద్దరూ ఆశ్చర్యపోయేరు.

అంత సొమ్ము ఎక్కడ్నుంచి తేగలరు?

చివరికి బేరం ఆడడం ప్రారంభించారు.

ఫారిన్ ఛాన్స్ దేముంది? మళ్ళీ మరోసారి వస్తుంది. ఈలోగా డిస్పెన్సరీ పెట్టి సంపాదించుకోవచ్చు కదా! కావాలంటే డిస్పెన్సరీ పెట్టడానికి అవసరమైన హంగులన్నీ సమకూరుస్తాం! ఇంకా తప్పదంటే— "మెయిన్‌రోడ్

మీద ముప్ఫయ్ వేలయినా సరే ఓ చక్కటి డాబా యిల్లు కొనిస్తాం క్లినిక్ తెరవడానికి" అన్నారు.

"ఇంత డిగ్రీ చదివావు కదా అల్లుడూ! ఆమాత్రం వివేచనా జ్ఞానంతో ఆలోచించలేవా? ఆడపిల్లల తండ్రుల్ని పీడించి దాంతో నిచ్చెనలు వేసుకుని మీదకి వెళ్లాలనుకొనే కంటే స్వంతంగా సంపాదించుకుని పైకెళ్లడం మంచిదనీ నలుగురూ హర్షిస్తారనీ" నచ్చ జెప్పారు.

చివరికి బేరం కుదిరింది....

ఆ ప్రకారంగా సీతాలక్ష్మిని పెళ్లా చేసి. చిక్కడపల్లిలో క్లినిక్ తెరిచి ప్రాక్టీస్ ప్రారంభించేశాడు కరుణాకరం.

ఫారిన్ ఛాన్స్ కోల్పోయినా కంటికి సంబంధించినటువంటి వ్యాధుల్లో ఆయనకు ఎన్నెన్నో ప్రయోగాలు చెయ్యాలని మహా వుత్సాహంగా వుండేది.

రకరకాల కంటివ్యాధుల్లో కొన్ని నయం చెయ్యబడేవి వున్నాయి. కొన్ని నయం కానివీ వున్నాయి.

అయితే అభివృద్ధి చెందిన ఆధునిక వైద్యశాస్త్రం ప్రకారం కొన్ని సాహసవంతమైన ప్రయోగాలు చేస్తే కొన్ని కంటి ఆపరేషన్లు విజయవంతమౌతాయి.

కాని....ఆ సాహస యత్నంలో సహకరించేవాళ్లు యెవరు?

తన ప్రయోగాలకు అవసరమైనవీ- పనికి వచ్చేవీ యెన్నో కేసులు ఈ దేశంలోనే వున్నా. ఆ రోగులు ఎక్స్పెరిమెంట్స్ తమమీద చేస్తామనగానే భయపడిపోయి రావడం మానేసేవారు.

మరికొందరు రోగులు మరింత స్వార్థబుద్ధి చూపించుకొనే వాళ్లున్నారు.

వాళ్ల ప్రయోగం విజయవంతమైతే డాక్టరుగా నీకు పేరొస్తుంది. మా కేమిటి వొరిగేది? అంచేత యెంత ఇవ్వగలవో తేల్చి చెప్పు" అంటూ డబ్బుకి ముడి పెట్టి బిగుసుక్కూర్చున్నారు.

అందరికీ డబ్బే కావాలి....

తనకూ డబ్బే కావాలి....

తానుమాత్రం డబ్బుకోసం. ఫారిన్ ఛాన్స్కోసం అత్తతో యెంత బేరం ఆడేడు?

అయితే చివరికి తాను కాంప్రమైజ్ అయ్యేడు.

వీళ్లు కాలేదు. అంతే తేడా....!


అంచేత ఈదేశం మీదా, ఇక్కడి మనుషులమీదా ఆయన కొన్ని ప్రత్యేక అభిప్రాయాల్ని ఏర్పరచుకున్నాడు.

కరుణాకరం దృష్టి జోగులు మీద పడింది.

జోగులు అనే శాల్తీని అతడురోజూ చూస్తూనే వున్నాడు.

ఇన్నాళ్ళూ ఆయన దృష్టిని అతడు ఆకర్షించలేదు.

వాడెప్పుడూ చిక్కడపల్లి సెంటర్లోనే అడుక్కుంటాడు.




ఇప్పుడు మాత్రం ఎందుకు ఆకర్షితుడయ్యాడూ అంటే జోగులుకి వో ఐ కాంప్లికేషన్ వుండటమే!

అదే కరుణాకరం ఎక్స్పెరిమెంట్ కోసం పనికొచ్చేది!....

కాని వాడు వో ముష్టివాడు

"గుడ్డోన్ని బాబూ! దరమం చెయ్యండి" అని అడుక్కునే వెధవ. వాడికి తాను ఉత్తపుణ్యానికి ఆపరేషన్ చెయ్యడమా?

బాగా ఆ కేసు పరిశీలించిన మీదట కరుణాకరం ఓ నిశ్చయానికి కొచ్చాడు.

వీడికి ఆపరేషన్ చేస్తే.... అది సక్సెస్ అయితే చాలు!

తనకి ఇంకేం గావాలి?....

కావలసినంత పేరు ప్రఖ్యాతులు....

ఇంతకూ వాడు వొప్పుకోవాలి కదా!....

'ఎలాగైనాసరే- వాణ్ణి వొప్పించి ఈ కేసు టేకప్ చెయ్యాలి.

వొప్పుకోక ఏం చేస్తాడు?

అంతగా అయితే ఇప్పుడు అడుక్కోవడానికి ఉన్న అవకాశం కళ్లు వచ్చాక పోగొట్టుకుంటాడు.

దానికి ప్రతిఫలంగా వొక ఐదారు వందలు పారేస్తే... వాడి బ్రతుకేదో వాడు బ్రతుకుతాడు.

అసలు ఇవన్నీ ఆపరేషన్ జరిగిన తర్వాత....

అది విజయవంతమైనాక అనుకోవలసిన మాటలు....

కరుణాకరం ఆలోచనల్లోంచి తేరు కున్నాడు.

జోగులు కోసం చూశాడు.

డిస్పెన్సరీకి పాతిక గజాల దూరంలో వున్న సినిమాహాలు దగ్గర అడుక్కుంటున్నాడు జోగులు.

కాంపౌండర్‌తో వాడిని తీసుకు రమ్మని చెప్పాడు కరుణాకరం.

కాంపౌండర్ జోగుల్ని తీసు కొచ్చాడు.

"ఏరా నీకు కంటి ఆపరేషన్ చేసి, చూపు తెప్పిద్దామని, వొక అనాధకి నేత్రదానం చేసినట్లవుతుందని అను కుంటున్నాను. నీకు ఇష్టమేనా?" అని అడిగాడు కరుణాకరం.

"నా మీద తమరికి అంత కనికరం ఎందుకు బాబూ! [illegible] ముష్టోడికి చూపు తెప్పిస్తే తమరికి లాభమేమి?" అన్ని ప్రశ్నించాడు.

"నీ కంటి జబ్బు ఓ స్పెషల్ కేసురా! ఇలా చాలా తక్కువ మందికి మాత్రమే వయమవుతుంది. అది ప్రాక్టికల్‌గా నేను ప్రూవ్ చేసుకుంటే నాకు పేరొస్తుంది." ఆనందంగా చెప్పుకు పోతున్నాడు డాక్టర్ కరుణా కరం.

చాలా తెలివిగా డాక్టర్ని క్రాస్ ఎగ్జా మిన్ చేసి, ఈ ఆపరేషన్ వల్ల కరుణా కరం బాగా లాభ పడతాడని అంచనా వేసుకున్నాడు జోగులు.

"మా సత్తిబాబు మామని అడిగి రేపు ఏసంగతీ చెప్తాను'" అన్నాడు వాడు.

"సరే! నీ యిష్టం. ఇందులో బల వంతం ఏమీ లేదు అని చెప్పాడు కరుణాకరం.

సత్తిబాబు మామతో వాడు ఏం సంప్రదించేడో తెలీదు కాని, మర్నాడు ఆపరేషన్‌కు సిద్ధమయ్యాడు జోగులు.

కరుణాకరం సంతోషంగా ఆప రేషన్ చేశాడు.

శాస్త్రరీత్యా అది విజయమయ్యిందో, కరుణాకరం అదృష్టం బావుండి, జోగులు కాంప్లికేషన్ కుదిరే యోగం వుండి సక్సెస్ అయ్యిందో కాని ఆప రేషన్ సరిగ్గానే జరిగి జోగులుకి చూపు వచ్చింది.

కరుణాకరం ఆనందానికి అవధు ల్లేవు....


వెంటనే వొక మెడికల్ జర్నల్‌కి ఆపరేషన్ వివరాల్తో ఓ చక్కని ఆర్టి కల్ కూడా రాశాడు అతడు.

జోగులుకి ఓ ఆరువందలు ఇచ్చాడు- ఏదైనా వ్యాపారం చేసుకోమని.

కథ అలా సాఫీగా సాగిపోతే పర్వా లేక పోయేదే!........ కాని ఇక్కడే మలుపుతిరిగింది.

ఆపరేషన్ జరిగిన వారం రోజుల తర్వాత....

జోగులు కరుణాకరం దగ్గర కొచ్చి 'ఓ రెండు వేలు ఇవ్వమని' అడిగాడు.




కరుణాకరం ఆశ్చర్యపోయేడు- జోగులు విపరీత ధోరణికి.

“మా సత్తిబాబు మాంవ చెప్పేడు.... మీకు నా ఆపరేషన్ వల్ల చాలా డబ్బూ-పేరూ వస్తుందని. మీరిచ్చింది నాకు సరిపోదు. ఇంకా రావాలి” అని నిలదీసి అడిగినట్టు అడిగాడు.

కరుణాకరం ‘ఇవ్వన’నలేదు. ఇవ్వ లేను అన్నాడు.

“సరే! ఎలా ఇవ్వలేవో నేనూ సూత్తాను” అనివిసురుగా వెళ్ళిపోయేడు జోగులు.

అడుక్కొనే వెధవకి కళ్లు రాగానే అవి నెత్తికెక్కి దబాయింపు ప్రారంభ మయ్యేసరికి కరుణాకరానికి నివ్వెర పాటూ, అసహ్యమూ రెండూ కలిగి వాటితో పాటే కోపం కూడా వచ్చింది.

రెండో రోజు-కల్లా జోగులు లాటి వాళ్ళచేత బెగ్గింగ్ బిజినెస్ ఏ వేపూ, కిళ్ళీబడ్డీలు ఏ వేపూ చేసే, సైకిల్ స్టాండు కోసరైన మావచేతలాయర్ నోటీసుయిప్పించేడు జోగులు. పరిహారంగా డబ్బు చెల్లించకపోతే, కోర్టు కెక్కాల్సి వస్తుందని. చక్రం యెలా తిప్పేడో గాని కుర్రలాయరు!

కరుణాకరం ఈ తాటాకు చప్పుళ్ళకి బెదరలేదు.

అతడికి జోగులు ప్రవర్తన చాలా చిత్రంగా అన్పించింది.

జరిగిన సంగతి అంతా వివరంగా చెప్పి, తానూ ఒక లాయర్ని పెట్టుకొని కేసు వాదించాడు కరుణాకరం.

ఇరుపక్షాల వాదనలూ విన్నాక కోర్టు వారు కేసు కొట్టేశారు.

తిక్క కుదిరింది వెధవకి అనుకున్నాడు కరుణాకరం.

ఇది జరిగిన కొన్నాళ్ళ దాకా జోగులు ఏమయ్యాడో మరి - ఆ సెంటర్లో కనిపించలేదు.

సుమారు రెండేళ్ళ తర్వాత....

కరుణాకరం దగ్గరకు దీనావస్థలో వచ్చాడు జోగులు.

చాలా దీనంగా రెండొందలు ఇమ్మని అడిగాడు.

కరుణాకరానికి జోగులు మీద జుగుప్స, అసహ్యం కలిగాయి.

ఆనాడు అలా ప్రవర్తించక పోతే, జోగులుకు తాను ఈ రోజున సహాయం చేసేవాడేమో....

కాని- దబాయించి డబ్బు గుంజాలనే ప్రయత్నం చేసినందుకు జోగుల్ని గెంటెయ్యాలనుకున్నాడు.

మళ్ళీ అంతలోనే అతడి చిత్రమైన ప్రవర్తన గుర్తుకు వచ్చింది కరుణాకరానికి.

సిగ్గున్న వాడైతే మళ్ళీ తన దగ్గరకు వచ్చి యాచించ గలడా?

మరి సిగ్గూ ఎగ్గూ వదిలేసి ఇలా దిగజారి అడిగాడంటే ఏ కారణం చేత అడిగాడో?- అనుకొని "ఎందుకు?" అని ప్రశ్నించాడు.

రోడ్డు ప్రక్క స్టౌ పెట్టుకొని మిరప కాయ బజ్జీలు అమ్ముకుంటూ బ్రతుకు తానని, సత్తిబాబు మామ తన దగ్గర డబ్బు గుంజేసుకుని గెంటివేశాడనీ అన్నాడు జోగులు.

"నేను ఇవ్వకపోతే ఏం చేస్తావ్?" కరుణాకరం సగం అనుమానంగా, సగం ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏం చేస్తానండీ? జిల్లేడు పాలు కళ్ళలో పోసుకుని గుడివాణ్ణయి పోతాను- ఈసారి మరెవరీ సయం చేయనీసు" అన్నాడు జోగులు.

ఫెళ్లున కొరడాతో కొట్టినట్లని పించింది జోగులు అన్న మాట కరుణాకరానికి.

రెండు నిముషాల పాటు మౌనంగా ఆలోచించాడు.

ఆ వెంటనే డెస్క్ లోంచి రెండు వంద రూపాయి నోట్లు తీసి జోగులు చేతిలో పెట్టాడు.

జేబులో వుంచుకుంటూ వెనుదిరిగిన జోగులువంక నిర్నిమేషంగా చూస్తూ నిలబడి పోయాడు కరుణాకరం "ఐ-స్పెషలిస్ట్." ★